క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి



పిట్లం: మండలంలోని గౌరారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన పనులను గురువారం ఎంపీవో బ్రహ్మం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

కామారెడ్డి అర్బన్: చేగుంటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన గురుకుల సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23లో 4వ తరగతి చదివిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో www.tgtwgurukulam.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



నిజాంసాగర్: నిరుద్యోగుల కోసం 25న బిచ్కుంద మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను గురువారం జుక్కల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆవిష్కరించారు. 50 కంపెనీలకు పైగా ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నీలుపటేల్, శివానంద్, శ్రీనివాస్, బానుగౌడ్, రాములు సేట్ తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకం పనులు



పిట్లం: మండలంలోని గౌరారం గ్రామం ముదిరాజ్ సంఘం వద్ద గురువారం సర్పంచ్ అనసూయ బోరు బావి తవ్వకం పనులను ప్రారంభించారు. ఆ ప్రాంతంలో నీటి సమస్య తీరినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు నిలిపివేయాలి



భిక్కనూరు: మండల కేంద్రంలో కొందరు ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలను నిలిపి వేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గంగ్లొళ్ల రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం భిక్కనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీరాంనగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయించాలని డీఎల్పీవో, ఈవోలకు ఆదేశాలు ఇచ్చినా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కర్రొల్ల రాజు, జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి, ద్యాగల క్రిష్ణ, వేణు, విష్ణు, వేణు, ప్రణయ్, భాను, స్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బిచ్కుంద: మండలంలోని రాజుల్లా, బిచ్కుందలో గురువారం ఎంపీపీ అశోక్ పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేదలకు సీఎం కేసీఆర్ ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రభాగ, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

ఆలయం వద్ద గదుల నిర్మాణానికి సర్వే

నస్రుల్లాబాద్: మండలంలోని కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద గదుల నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు భూ సర్వే చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టేందుకు సర్వే చేసినట్లు గిర్దావార్ అంజు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కష్టాలు

- తాగు నీరు, నీడ కోసం ఇబ్బందులు
- నెల రోజులుగా కేంద్రాల వద్ద పడిగాపులు



ఎండ వేడిమికి తాళలేక కొనుగోలు కేంద్రం వద్ద చెట్టు కింద సేద తీరుతున్న రైతులు

ఎల్లారెడ్డి రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే విక్రయించేందుకు కష్టాలు తప్పడం లేదు. విక్రయించేందుకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కొన్ని చోట్ల నెల రోజులైనా వాటికి కాంటా వేయడం లేదు. ఒక వేళ కాంటా వేసినా సరిపడా లారీలు రాక ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదు. దీంతో ఎలాంటి నీడ, తాగునీటి వసతి లేని కొనుగోలు కేంద్రాల వద్ద రైతన్నలుగా నెల రోజులుగా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలను పండించడం ఒక ఇబ్బంది అయితే, వాటిని విక్రయించడం మరో మరో ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి, వెల్లుట్ల, మత్తమాల సొసైటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలను కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కనీసం చలువ పందిర్లు వేయక పోవడంతో సమీపంలోని చెట్ల కింద ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం తాగేందుకు నీరు కూడా అక్కడ అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో కరెంటు సౌకర్యం కల్పించక పోవడంతో రాత్రి పూట మరింత ఇబ్బందులు ఎదురౌతున్నాయని పేర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, చలువ పందిళ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సొసైటీ సిబ్బంది మాత్రం ప్రతిఏటా ఖర్చు చేస్తున్నట్లు కాగితాల్లో చూపి వాటిని మెక్కేస్తున్నారే తప్ప రైతులకు మాత్రం ఆ మేరకు వసతులు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వసతులు కల్పిస్తున్నాం

కొనుగోలు కేంద్రా ల వద్ద రైతులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తు న్నాం. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం.

– విశ్వనాథం, సొసైటీ కార్యదర్శి, ఎల్లారెడ్డి

ఎండకు ఇబ్బందులు



కొనుగోలు కేంద్రాల వద్ద ఉండేందుకు కనీసం నీడ లేదు. తప్పని పరిస్థితుల్లో సమీపంలోని చెట్ల కింద సేద తీరుతున్నాం.

– సంగవ్వ, రైతు, లింగారెడ్డిపేట

నెల రోజులుగా అక్కడే



నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దే ఉంటున్నాం. కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– పర్వయ్య, రైతు, లింగారెడ్డిపేట

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



విద్యుత్ సౌకర్యం లేక రాత్రి పూట పందులు రాకుండా నిలువరించడం ఇబ్బందిగా ఉంది. వెలుతురు ఉంటే వాటి బెడద ఉండదు.

– కృష్ణ, రైతు, లింగారెడ్డిపేట

తాగునీటి వసతి అవసరం



కేంద్రాల వద్ద తాగునీటితో పాటు నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎండకు దప్పిక తీర్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– శంకర్, రైతు, లింగారెడ్డిపేట

పాతవస్తువుల సేకరణకు ప్రత్యేక సెంటర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ: మున్సిపాలిటీని వార్డుల్లో పాత వస్తువుల సేకరణ కోసం ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంపై మెప్మా ఆర్పీలు, వార్డు ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మట్లాడుతూ న్యూస్‌పేపర్లు, పాత పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, అల్యూమినియం, తదితర పాత వస్తువులను వార్డుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల వద్ద ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమం ఈ నెల 20 నుంచి వచ్చే నెల 5 వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, వైస్ చైర్మన్ జుబేర్, కో ఆప్షన్ సభ్యులు బాబా, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో బోనాల సమర్పణ



నిజాంసాగర్: మండలంలోని ఆరేడ్, జక్కాపూర్ గ్రామాల్లో రేణుకా ఎల్లమ్మ బోనాలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆరేడ్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా గ్రామస్థులు ఇంటికో బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ఘనంగా వీరభద్ర స్వామి ఆలయం వార్షికోత్సవం



భిక్కనూరు: భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వరాలయం క్షేత్రపాలకుడై వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఊరడమ్మ, శ్రీ సిద్ధగిరి సమాధి వద్ద, నగరేశ్వరాలయం, వేకంటేశ్వరాలయం, సంతోషిమాత, మాలే ప్రాంతంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సిద్ధరామేశ్వరాలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, ఈవో శ్రీధర్, ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి నేతలు మైపాల్ రెడ్డి, బల్యాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



శేర్‌శంకర్ తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్



టేక్రియాల్‌లో..

రాజంపేట: కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ శంకర్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని శేర్‌శంకర్ తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేంటిరాజు, డాక్టర్ సంగీత, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మీ, బీఆర్‌ఎస్ నాయకుడు బల్‌రాం పాల్గొన్నారు.

తాడ్వాయి: పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రాజశేఖర్ కోరారు. మండలంలోని సంతాయిపేట్ గ్రామంలో పలువురు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు.


లింగంపేట: మండలంలోని సురాయిపల్లి గ్రామంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. సజ్జన్‌పల్లి, ఎల్లమ్మతండాల్లో 327 మందికి పరీక్షలు చేసి 126 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు.

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో కౌన్సిలర్ జూజాల శంకర్‌రావు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. దృష్టి లోపం ఉన్న వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో 283 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, డాక్టర్లు వేణుమాధవ్, అజమతుల్లా డీఈవోలు కిషోర్, రమేష్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది చారి, సునీత, ఇందిర తదితరులు పాల్గొన్నారు

సదాశివనగర్: మండలంలోని 15 గ్రామ పంచాయితీల్లో 114 రోజుల పాటు చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం గురువారం పద్మాజివాడి గ్రామంతో ముగిసినట్లు వైద్యాధికారి ఆస్మ తెలిపారు. 16,159 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2,992 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. మరో 1,903 మందికి కళ్ల అద్దాల కోసం ఆర్డర్ చేసినట్లు వెల్లడించారు. వెయ్యి మందికి సర్జరీ అవసరమని గుర్తించామని పేర్కొన్నారు. సర్పంచ్ మడిపెద్ది కవితానంద్, ఎంపీటీసీ సుజాత పాల్గొన్నారు.

సమ్మె విరమించిన వీవోఏలు



ఏపీఎంకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

ఎల్లారెడ్డి: సమ్మె విరమించి విధుల్లో చేరుతామని వీవోఏలు గురువారం ఏపీఎంకు గురువారం వినతి పత్రం అందజేశారు. సమస్యల సాధన కోసం 20 రోజులకుపైగా వీవోఏలు నిరవధికంగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. నెలకు రూ. 26 వేల వేతనం, సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేయాలనే డిమాండ్లతో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం నుండి విధులకు హాజరవుతామని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు ఈశ్వర్ తెలిపారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన



మాచారెడ్డి: డ్రోన్‌తో పంటలకు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలోని జీవన్‌రెడ్డికి చెందిన చెరకు తోటలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ సందర్భంగా గాయత్రీ షుగర్స్ అసిస్టెంట్ మేనేజర్ డి.బాల్‌రాజు మాట్లాడుతూ డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల రైతులకు సమయంతో పాటు కూలి ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్లు సిద్దాగౌడ్, దామోదర్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, రైతులు వెంకట్‌రెడ్డి, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సాయాగౌడ్



తాడ్కోల్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

బిచ్కుంద: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ అన్నారు. గురువారం ఎంపీవో మహిబూబ్‌తో కలిసి ఆయన గుండెనెమ్లి, పెద్దదడ్గిలో పారిశుధ్య పనులు, నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వారం పాటు మురికి కాలువల్లో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ తదితర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మహిబూబ్ పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి, వెల్గనూర్, బంజపల్లి, మహమ్మద్‌నగర్, కొమలంచ, సింగితం గ్రామ పంచాయతీల్లో మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేశారు. పారిశుధ్య పనులను ఎంపీవో అబ్బాగౌడ్ దగ్గరుండి పరిశీలించారు.

సదాశివనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. అన్ని వీధుల్లోని డ్రెయినేజీలు, రోడ్లు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు పరిశుభ్రంగా మారుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని నాగారం, తాడ్కోల్ గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, రాచప్ప, పంచాయితీ కార్యదర్శులు ప్రశాంతి, పుట్టి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత మందుల విక్రయాలు



మద్నూర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మద్నూర్: వ్యవసాయానికి వినియోగించే కొన్ని మందులను ప్రభుత్వం నిషేధించినా కొందరు వ్యాపారులు వాటిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. గ్లైఫోసెట్ 41 శాతం, మీరా–71, అమ్మోనియం సాల్ట్ రకం మందులను విక్రయించకుండా నిషేధించారు. ప్రతి ఏటా అధికారులు ఫర్టిలైజర్, మందుల షాపుల్లో తనిఖీ సమయంలో నిషేధిత మందులు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పంటలను ఆశించే పురుగులు, కలుపు మొక్కల నివారణకు వినియోగిస్తున్న మందుల ద్వారా పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతున్నాయని శాస్త్రవేత్తల పరిశీలనలో తేలింది. కీటకాలను చంపేందుకు వాడే మందుల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొన్ని మందులను నిషేధించిందని అధికారులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న కొందరు ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు అధికారులకు అమ్యామ్యాలు సమర్పిస్తున్నందు వల్లే నిషేధిత మందుల విక్రయాలపై పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పెసర, పత్తి, సోయాబీన్ తదితర పంటల్లో కలుపు నివారించేందుకు రైతులు విచ్చలవిడిగా గడ్డి మందులను వినియోగిస్తున్నారు.

లైసెన్స్ రద్దు చేస్తాం..

నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు తెలిపారు. వర్షాకాల సీజన్ ప్రారంభంలో అన్ని దుకాణాలను తనిఖీలు చేసి నిషేధిత మందులు విక్రయించకూడదని సూచిస్తాం. రహస్యంగా ఎవరైనా విక్రయిస్తే అలాంటి దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేస్తాం.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



పిట్లంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే



కొండాపూర్‌లో..

పిట్లం: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం ఆయన మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దఫెదర్ రాజు, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు అంజిరెడ్డిలతో కలిసి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను కొనుగోలుకు కేంద్రం సహకరించక పోయిన రాష్ట్ర ప్రభుత్వంమే ధాన్యం, జొన్నలను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. జొన్న క్వింటాల్‌కు రూ. 2,970 ప్రకారం మద్దతు ధర చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.

రాజంపేట: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్గొండ సొసైటీ చైర్మన్ కంది శివరాములు అన్నారు. గురువారం కొండాపూర్ గ్రామంలో మక్కలు, జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండమన్మండ్లు, సర్పంచ్‌లు స్వాతి, దేవిదాస్, ఏఈవో శిల్ప, సీఈవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

మాచారెడ్డి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ అన్నారు. గురువారం మండలంలోని ఎల్లంపేట గ్రామంలో నిర్వహించిన సువార్త స్వస్థత కూటముల ప్రార్థనలకు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బ్రదర్ ఆదామ్ బెన్నీ, ఫాస్టర్ డేవిడ్, ఎంపీడీవో బాలక్రిష్ణ, మాజీ కౌన్సిలర్ రామ్మోహన్, నాయకులు నారాయణ, అరవింద్, నవీన్, రాజేందర్, నర్సయ్య, లక్ష్మిరాజం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతుల పక్షాన పోరాటం



నిజాంసాగర్: రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, కాంగ్రెస్ నాయకుడు తోట లక్ష్మికాంతరావు అన్నారు. నాలుగు రోజుల కిందట రైస్ మిల్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడిన నర్సింగ్‌రావ్‌పల్లికి చెందిన రైతు రాంరెడ్డిని వారు వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్)లో దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 రుసుంతో జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఫేజ్ 1లో వచ్చే నెల 16న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఫేజ్–2లో ప్రవేశాలకు రూ.400 చెల్లించి వచ్చేనెల 16 నుంచి 26 వరకు దరఖాస్తు చేసుకోవాలి. వెబ్ ఆప్షన్లు వచ్చే 16 నుంచి 27 వరకు ఉంటుందని వివరించారు. బీఏ, బీఎస్సీ, బీకాం(వొకేషనల్), బీకాం(ఆనర్స్), బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీబీఎం, బీసీఏ, డి–ఫార్మసీ కోర్సులకు http://dost.cgg.gov.inలో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మితిమీరిన వేగం వద్దు

మద్నూర్: వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని ఎస్సై కృష్ణారెడ్డి హెచ్చరించారు. సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు.

పారిశ్రామికవేత్త షేక్ అలీ మృతి

బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త షేక్ అలీ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఆయన చిన్ననాటి మిత్రుడు. బాధిత కుటుంబ సభ్యులను స్పీకర్ ఫోన్‌లో ఓదార్చారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దుర్కి గ్రామానికి వెళ్లి అలీ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, మహ్మద్ ఎజాస్, పర్వుగొండ, షేక్ అజీమ్, అక్బర్, అజీజ్, మసూద్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

24వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా మండలంలోని కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 24వ రోజుకు చేరుకున్నాయి. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం అన్నారు. మహరాజులు చేపట్టిన దీక్షకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, బీజేపీ నాయకుడు నేత సింగం శ్రీనివాస్‌లు సంఘీబావం తెలిపారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం

దోమకొండ: గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు అభివృద్ధి కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవ్వాలని సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య గురువారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కలిసి ఆహ్వానించారు. 21న మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.

ఓబీసీ సమ్మేళనానికి తరలిన బీజేపీ నాయకులు

సదాశివనగర్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి హైదరాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ సమ్మేళన కార్యక్రమానికి బీజేపీకి చెందిన ఓబీసీ జిల్లా, మండల నాయకులతో పాటు మండలానికి చెందిన గంగాధర్ రావు, కుషాజి రాజేందర్ రావు, సంజీవ్‌రావు తదితరులు వెళ్లారు.